సాక్షి
వికారాబాద్
గురువారం । 26 । సెప్టెంబర్ । 2024



రైతుకు శాపం

ధారూరు మండలంలో భారీ వర్షాలకు కాగ్నా ఉపనది ఉప్పొంగింది. మైలారం వద్ద పంట పొలాలు దెబ్బతిన్నాయి. 8లో▸



కల్తీ కలవరం

కిరాణా దుకాణాల్లో కల్తీ నరుకులు విక్రయిస్తుండటంతో స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు. 8లో▸



పౌష్టికాహారంతో ఆరోగ్యం

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని సీడీపీఓ మెహరున్నిసా బేగం, కుల్కచర్ల కేజీబీవీ ప్రిన్సిపాల్ దేవి అన్నారు. 8లో▸

న్యూస్‌రీల్

కరన్‌కోట్ పోలీస్‌స్టేషన్‌కు ఉత్తమ అవార్డు

- రాష్ట్రస్థాయిలో 7వ ర్యాంక్
- డీజీపీ జితేందర్ నుంచి అవార్డు అందుకున్న ఎస్‌ఐ విఠల్‌రెడ్డి



అవార్డు అందుకుంటున్న ఎస్‌ఐ విఠల్‌రెడ్డి

తాండూరు రూరల్: మండలంలోని కరన్‌కోట్ పోలీస్‌స్టేషన్‌కు ఉత్తమ అవార్డు లభించింది. రాష్ట్రస్థాయిలో 7వ ర్యాంక్‌ను సొంతం చేసుకుంది. బుధవారం హైదరాబాద్‌లో డీజీపీ జితేందర్ నుంచి ఎస్‌ఐ విఠల్‌రెడ్డి అవార్డు అందుకున్నారు. కార్యక్రమంలో శాంతిభద్రతల అడిషనల్ డీజీ మహేష్ భగవత్ తదితరులు పాల్గొన్నారు.

అవార్డుకు ఎంపిక ఎలా చేస్తారంటే..

రాష్ట్ర వ్యాప్తంగా పోలీస్ స్టేషన్లకు వచ్చే కేసుల వివరాలను సంబంధిత అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. డీజీపీ కార్యాలయంలోని సిటిజన్ ఫీడ్ బ్యాక్ సెంటర్ ద్వారా ఫిర్యాదుదారుల నుంచి వివరాలు సేకరిస్తారు. కేసు విషయమై స్టేషన్‌కు వచ్చినప్పుడు అక్కడి సిబ్బంది స్పందించిన తీరు.. కేసు పరిష్కారం కోసం చూపిన చొరవ, లంచం ఏమైనా అడిగారా వంటి వివరాలు సేకరిస్తారు. వీటి ఆధారంగా ఉత్తమ సేవలు అందించిన స్టేషన్‌కు ర్యాంక్ కేటాయిస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా పది ఉత్తమ పోలీస్ స్టేషన్లను ఎంపిక చేస్తారు. ఇందులో కరన్‌కోట్ పోలీస్‌స్టేషన్‌కు 7వ ర్యాంక్ వచ్చింది. దీంతో సిబ్బంది సంతోషం వ్యక్తం చేశారు. అవార్డు తమ బాధ్యతలను మరింత పెంచిందని వారు పేర్కొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

అనంతగిరి: ఎస్‌బీఐ, గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో చిల్కూరు నందు మహిళలకు బ్యూటీపార్లర్ విభాగంలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ సంచాలకులు రమేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. 19 నుంచి 45 సంవత్సరాల గ్రామీణ మహిళలు అర్హులన్నారు. శిక్షణ కాలం 30రోజులని, అక్టోబర్ 5వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు. ఉచిత వసతి, భోజనం ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నంబరు 85001 65190లో సంప్రదించాలని ఆయన కోరారు.

రాహుల్ గాంధీ వ్యాఖ్యలు సరికావు

చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం

మొయినాబాద్ రూరల్: అమెరికాలో పర్యటిస్తున్న రాహుల్‌గాంధీ భారతదేశంలో రిజర్వేషన్లు తొలగిస్తామనడం సరికాదని బీజేపీ రాష్ట్ర నాయకుడు, చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బంటు జ్ఞానేశ్వర్ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో జిల్లా స్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంబేడ్కర్ దేశ సుపరిపాలన కోసమే రాజ్యాంగం రూపొందించి రిజర్వేషన్లను రూపొందిచారన్నారు. రిజర్వేషన్ల మూలానే దేశం అభివృద్ధిలో ముందడుగు వేస్తోందన్నారు. అన్ని కులాలను కలుపుతూ ప్రధాని మోదీ అభివృద్ధికి కృషి చేస్తుంటే.. పరాయి దేశంలో పర్యటిస్తున్న రాహుల్‌గాంధీ మాటలు విచారకరమన్నారు.


మోహన్‌బాబు ఇంట్లో చోరీ

పహాడీషరీఫ్: సినీ నటుడు మంచు మోహన్‌బాబు ఇంట్లో చోరీ జరిగిన సంఘటన పహాడీషరీఫ్ ఠాణా పరిధిలో ఆలస్యంగా వెలుగు చూసింది. నిందితుడిని బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ గురువారెడ్డి తెలిపిన ప్రకారం.. జల్‌పల్లి శివారులో మోహన్‌బాబుకు నివాసం(మంచు టౌన్‌షిప్) ఉంది. ఇంటి ఆవరణలోనే వ్యక్తిగత కార్యదర్శులు, సెక్యూరిటీ సిబ్బంది, పనివారి కోసం వేర్వేరు గదులున్నాయి. ఈ నెల 22న మోహన్‌బాబు ఆదేశాల మేరకు పర్సనల్ సెక్రటరీ కిరణ్‌కుమార్ తిరుపతిలోని ఎంబీయూ యూనివర్సిటీ నుంచి రూ.10 లక్షల నగదు తీసుకొని రాత్రికి మంచు టౌన్‌షిప్‌నకు చేరుకున్నాడు. రాత్రి కావడంతో ఉదయాన్నే డబ్బులు మోహన్‌బాబుకు ఇద్దామని తన గదిలో ఉంచాడు. ఈ టౌన్‌షిప్‌లోనే అనంతపురం జిల్లా నల్లమాడ మండలం ఎర్రవంకపల్లికి చెందిన గణేశ్ నాయక్(24) హౌజ్ బాయ్‌గా పని చేస్తున్నాడు. కిరణ్ డబ్బు లు తెచ్చిన విషయం ముందే తెలుసుకున్న గణేశ్ అతడు నిద్రపోయాక డబ్బుతో పరారయ్యాడు. ఉదయాన్నే లేచిచూడగా డబ్బుతోపాటు గణేష్ కనిపించలేదు. సీసీ కెమెరాలు పరిశీలించగా అతడే డబ్బు తీసుకెళ్లినట్లు నిర్ధారణ అయ్యింది. మోహన్‌బాబు సూచన మేరకు కిరణ్ 23న పహాడీషరీఫ్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. నిందితుడు తిరుపతిలో ఉన్నట్లు గుర్తించిన పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకొని రూ. 7,36,400ల నగదు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. అనంతరం రిమాండ్‌కు తరలించారు.

సత్వరం పూర్తవ్వాలి

సాక్షి ఎఫెక్ట్..


నిర్మించినా.. ప్రారంభించరా?



దుద్యాల్ మండలం కుదురుమల్ల జెడ్పీహెచ్ఎస్‌లో మూత్రశాలలు లేక విద్యార్థినులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై బుధవారం సాక్షి దినపత్రికలో నిర్మించినా.. ప్రారంభించరా..? శీర్షికన ప్రచురితమైన కథనానికి డీఈఓ రేణుకాదేవి స్పందించారు. పాఠశాలలో 90 మంది బాలికలు, 95 మంది బాలురు ఉన్నారని తెలిపారు. మన ఊరు – మన బడి పథకంలో భాగంగా మూత్రశాలలు నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. 80శాతం పనులు పూర్తయ్యాయని, 20శాతం పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. దసరా సెలవులు పూర్తయ్యే నాటికి మూత్రశాలలను అందుబాటులోకి తేవాలని పాఠశాల హెచ్‌ఎంకు సూచించారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. అప్పటి వరకు స్కూల్ ఆవరణలోని ప్రాథమిక పాఠశాల మూత్రశాలలను విద్యార్థినులు వినియోగించుకునేలా చూడాలని హెచ్‌ఎంకు సూచించారు.



చెత్త తొలగింపు

దుద్యాల్ మండలం హస్నాబాద్ గ్రామంలోని మత్స్యకార భవన సమీపంలో ఇళ్ల మధ్య చెత్త, మురుగు పేరుకుపోవడంతో బుధవారం సాక్షి దినపత్రికలో మురుగు భరించలేం అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి పంచాయతీ సిబ్బంది స్పందించారు. ఉదయం జేసీబీ సాయంతో ఇళ్ల మధ్య పేరుకుపోయిన చెత్తను, మురుగును తొలగించారు.

– దుద్యాల్



సన్నాల సాగు రెట్టింపు

రూ.500 బోనస్ ప్రకటనతో పెరిగిన పంట విస్తీర్ణం

- గతేడాది వానాకాలంలో 14వేల ఎకరాల్లో..
- ప్రస్తుత సీజన్‌లో 30వేల ఎకరాల్లో సాగు
- యాసంగిలో మరింత పెరిగే అవకాశం ఉందంటున్న అధికారులు

వికారాబాద్: ప్రస్తుత సీజన్(వానాకాలం)లో సన్న వడ్ల సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. గతేడాదితో పోలిస్తే రెండింతలయ్యింది. ఇప్పటి దాకా ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా లబ్ధిదారులకు దొడ్డు బియ్యం పంపిణీ చేస్తూ వస్తోంది. త్వరలో సన్నబియ్యం పంపిణీ చేస్తామని ప్రకటించిన నేపథ్యంలో సన్న వడ్ల సాగుకు ప్రాధాన్యత సంతరించుకుంది. జిల్లాలో ఏటా వరి సాగులో 10 శాతం మాత్రమే సన్న రకం వడ్లను సాగు చేసేవారు. వీటిని రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో కాకుండా బహిరంగ మార్కెట్‌లో విక్రయించేవారు. త్వరలో చౌకధరల దుకాణాల్లో సన్న బియ్యం పంపిణీ చేస్తామని ప్రకటించిన నేపథ్యంలో ఇప్పుడు రైతుల నుంచి సన్న వడ్లు సేకరించడం తప్పని సరిగా మారింది.

1,30,000 ఎకరాల్లో వరి సాగు

జిల్లాలో సాధారణ వరి సాగు విస్తీర్ణం 93వేల ఎకరాలు కాగా ప్రస్తుత సీజన్‌లో అంతకుమించి సాగు చేశారు. 1,30,000 ఎకరాల్లో వరి పంట వేశారు. పరిగి వ్యవసాయ డివిజన్‌లో అత్యధికంగా 46,876 ఎకరాల్లో పంట సాగు చేయగా.. కొడంగల్ డివిజన్‌లో 45,137 ఎకరాల్లో, తాండూరు డివిజన్‌లో 29,964 ఎకరాల్లో, వికారాబాద్ డివిజన్‌లో 8,023 ఎకరాల్లో వరి పంట వేశారు. జిల్లాలో 20 మండలాలు ఉండగా 12 మండలాల్లో వెయ్యి నుంచి ఐదు వేల ఎకరాల్లో వరి పంట సాగు చేశారు. గతేడాది జిల్లాలో ఇదే సీజన్‌లో 14వేల ఎకరాల్లో సన్న రకం వడ్లు సాగు చేయగా ఈ ఏడాది ఇప్పటి వరకు 30వేల ఎకరాల్లో పంట వేశారు. బహిరంగ మార్కెట్‌లో సన్నబియ్యానికి మంచి డిమాండ్ ఉండటంతో రైతులు ఆ పంట వేసేందుకు మొగ్గు చూపుతున్నారు. క్వింటాలు సన్న వడ్లకు రూ.500 బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడం కూడా సాగు విస్తీర్ణం పెరగడానికి కారణమైంది.

జిల్లాలో 2,41,622 రేషన్ కార్డులు

జిల్లాలో 2,41,622 రేషన్ కార్డులు ఉన్నాయి. వీరికి ప్రతి నెలా 4,673 మెట్రిక్ టన్నుల బియ్యం సరఫరా చేయాల్సి ఉంది. ఈ లెక్కన ఏడాదికి 56,076 మెట్రిక్ టన్నుల ధాన్యం అవసరం ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుత సీజన్‌లో 30 వేల ఎకరాల్లో సన్న రకం వడ్లు సాగు చేస్తున్నారు. యాసంగిలో మరో 30 వేల ఎకరాల్లో పంట సాగయ్యే అవకాశం ఉందని అధికారులు అంటున్నారు. ఈ రెండు సీజన్లలో లక్ష నుంచి 1.20 లక్షల మెట్రిక్ టన్నుల సన్న రకం వడ్లు వచ్చే అవకాశం ఉంది. వీటిని మిల్లింగ్ చేయిస్తే 65 నుంచి 70 వేల మెట్రిక్ టన్నుల సన్న రకం బియ్యం సమకూరే అవకాశం ఉంటుంది. జిల్లా రైతులు పండించిన సన్న రకం వడ్లను మొత్తం సేకరిస్తేనే రేషన్ కార్డు లబ్ధిదారులకు సరిపోతాయని అధికారులు భావిస్తున్నారు.



రైతుల నుంచి సేకరించిన ధాన్యం

సేంద్రియం ఆరోగ్యకరం

- కలెక్టర్ ప్రతీక్‌జైన్
- దోర్నాల్‌పల్లిలో సేంద్రియ పద్ధతిలో సాగు చేసిన పంటల పరిశీలన

దోమ: ఆరోగ్యవంతమైన సమాజం కావాలంటే సేంద్రియ వ్యవసాయాన్ని అభివృద్ధి చేసుకోవాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ రైతులకు సూచించారు. విషతుల్యమైన పంటలతో ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారని, ఈ ముప్పు నుంచి బయట పడాలంటే రైతులు ఆర్గానిక్ పంటల వైపు మొగ్గు చూపాలని అన్నారు. దోమ మండలం దోర్నాల్‌పల్లికి చెందిన రైతులు శ్రీనివాస్, అంజిలయ్య, రాములు, కృష్ణ, నవ్వయ్య సేంద్రియ విధానంలో సజ్జ, పెసర, కొర్ర, కంది, బెంబెర్లు, మినుము, మంచి నువ్వులు, మొక్కజొన్న, వరి వంటి పంటలు సాగు చేశారు. బుధవారం కలెక్టర్, వాసన్ సంస్థ రాష్ట్ర కోఆర్డినేటర్లు భాగ్యలక్ష్మి, లక్ష్మణ్, నాబార్డ్ జిల్లా డెవలప్‌మెంట్ మేనేజర్ అఖిల్, అరక రైతు ఉత్పత్తిదారుల సంఘం సభ్యులతో కలిసి సేంద్రియ పంటలను పరిశీలించారు. అనంతరం రైతులతో సమావేశం నిర్వహించారు. సేంద్రియ పద్ధతిలో పంటలు సాగు చేసిన రైతులను కలెక్టర్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మిగిలిన రైతులు కూడా ఆర్గానిక్ విధానంలో పంటలు సాగు చేయాలని సూచించారు. రసాయన ఎరువులు, పురుగు మందును పంటలకు వాడే క్రమంలో రైతులు, విషతుల్య ఆహారాన్ని తీసుకునే ప్రజలు రోగాల బారిన పడుతున్నారని తెలిపారు. సేంద్రియ సాగుతో దీన్ని అరికట్టవచ్చని పేర్కొన్నారు. అనంతరం గ్రామంలోని పాఠశాలను సందర్శించి మొక్కలు నాటి నీరు పోశారు.

బాస్‌పల్లి రైతు సేవా కేంద్రంలో..

మండలంలోని బాస్‌పల్లిలోని సుస్థిర వ్యవసాయ రైతు సేవా కేంద్రంలో వివిధ రకాల చిరుధాన్యాలు, వ్యవసాయ పనిముట్లను కలెక్టర్ ప్రతీక్ జైన్ పరిశీలించారు. ప్రతి రైతుకూ చిరుధాన్యాలు అందుబాటులో ఉంచేలా చూడాలన్నారు. మార్కెట్‌లో ఈ తరహా పంటలకు మంచి డిమాండ్ ఉందన్నారు. దోమ, దౌల్తాబాద్, బొంరాస్‌పేట మండలాల్లో ఉపాధి హామీ పథకం కింద గోదాంలు నిర్మించుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం గ్రామంలోని పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మహేశ్‌బాబు, తహసీల్దార్ పురుషోత్తం, మండల వ్యవసాయ అధికారి ప్రభాకర్‌రావు, మండల విద్యాధికారి వెంకట్, ఏపీఓ దస్తయ్య, మాజీ సర్పంచ్ యాదయ్య సాగర్ తదితరులు పాల్గొన్నారు.



దోర్నాల్‌పల్లిలో పత్తి పంటను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రతీక్ జైన్, అధికారులు

ప్రకృతి వ్యవసాయం చేయండి

పరిగి: రైతులు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి ప్రకృతి వ్యవసాయం చేయాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. బుధవారం మండలంలోని నజీరాబాద్‌తండాలో ఆయా గ్రామాల రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రసాయనాలతో పండించిన పంటలు తినడం వల్ల వ్యాధులు కొని తెచ్చుకోవడమే అన్నారు. జీవన విధానంలో అనేక రోగాల బారిన పడుతున్నాంటే వాటికి మూలం రసాయన ఎరువులేనని పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండిస్తున్న పంటలకు అతివృష్టి, అనావృష్టిని తట్టుకోవడమే కాకుండా భూమిలోని జీవరాశిని, జీవవైవిధ్యాన్ని పెంపొందించేందుకు అవకాశం ఉంటుందన్నారు. వీటిని తినడం వలన ఆరోగ్య సమస్యలు రావని, ఒకవేళ వచ్చినా వాటిని అధిగమించవచ్చని తెలిపారు. ప్రతి రైతూ ప్రకృతి వ్యవసాయం దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో మండల అధికారులు, రైతులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో పాల్గొన్న అధికారులు, రైతులు

భూ కుంభకోణాల ఘనత ఆనంద్‌దే

- దాడులతోపాటు అక్రమ కేసులు పెట్టించిందీ ఆయనే
- మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్‌పై కాంగ్రెస్ నేతల మండిపాటు

ధారూరు: బీఆర్ఎస్ హయాంలో అధికార బలంతో భూ కుంభకోణాలకు పాల్పడమే కాకుండా.. అమాయకులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టించిన ఘనుడు మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనందేనని కాంగ్రెస్ నాయకులు ధ్వజమెత్తారు. ధారూరులోని శుభం ఫంక్షన్ హాలులో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మాన్‌సింగ్, ఏఎంసీ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రాములు తదితరులు మాట్లాడారు. మర్పల్లిలో జరిగిన చిన్న విషయాన్ని పెద్దదిగా చేశారని ఆరోపించారు. మచ్చలేని నాయకుడైన స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై చవకబారు విమర్శలు చేయడం ఆనంద్ దిగజారుడు తనానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఆయన స్వగ్రామంలోని 70 ఎకరాల అసైన్డ్ భూములను 40 మంది రైతులు సాగు చేసుకుంటుండగా.. కేవలం తన తల్లి పేరున మూడెకరాలకు పట్టా పొంది, ఇతర రైతులకు మొండిచేయి చూపాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. వందేళ్లుగా నిజాం వారసురాలి భూములను సాగు చేసుకుంటున్న గిరిజనులకు పట్టాలు ఇప్పించాల్సింది పోయి 73 ఎకరాల భూమిని ఓ కంపెనీకి కట్టబెట్టారని మండిపడ్డారు. బూర్గుగడ్డలో 36 ఎకరాల భూమిని ఇతరులకు అమ్మించారని ఆరోపించారు. బినామీ పేర్లతో వందల ఎకరాలు అన్యాక్రాంతం చేసిన వ్యక్తి ఆనంద్ అని విమర్శించారు. సర్పన్‌పల్లి ప్రాజెక్టు విషయంలో తహసీల్దార్‌ను బెదిరించడం, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి వాహనంపై దాడి వంటి దుశ్చర్యలకు పాల్పడింది నీవు కాదా అని ప్రశ్నించారు. పదవి పోయిన విషయాన్ని విస్మరించి.. ఇప్పటికీ తానే ఎమ్మెల్యేలా వ్యవహరిస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ ఎల్.అశోక్ ముదిరాజ్, కాంగ్రెస్ నాయకులు పాండునాయక్, బుజ్జయ్యగౌడ్, రాంరెడ్డి, హన్మయ్య, మల్లారెడ్డి, బసప్ప, వాణి, రాజేందర్, రమేశ్‌కృష్ణ, లాల్ అహ్మద్, టి.మల్లేశం, అమరేశ్వర్‌రావు, కృష్ణారెడ్డి, ముజాఫర్ తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు

డీసీహెచ్ఎస్ డాక్టర్ రాజు

ఆమనగల్లు: విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని రంగారెడ్డి జిల్లా కో ఆర్డినేటర్ ఆఫ్ హాస్పిటల్ సర్వీసెస్ (డీసీహెచ్ఎస్) డాక్టర్ రాజు అన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులు, సిబ్బందిని ఆదేశించారు. పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం వైద్యులు, సిబ్బందితో సమావేశం నిర్వహించి సూచనలు చేశారు. అంతకుముందు నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రి నూతన భవనాన్ని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. రోగులకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నామన్నారు. ఆస్పత్రిలో అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మహిళల కోసం త్వరలోనే గైనకాలజిస్ట్‌ను నియమించనున్నట్లు స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు పరీక్షిత్ నరేందర్, నాగరాజు, మైమూనా, సిబ్బంది ఏసుమణి, అలివేలు, జ్యోతి, సంపూర్ణ, మునీర, ఇందిర, దేవేందర్, వేణు ఉన్నారు.

కమ్యూనిటీ ఆస్పత్రిలో..

షాద్‌నగర్: పట్టణంలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రిని బుధవారం రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆస్పత్రి రికార్డులను పరిశీలించారు. వైద్యం కోసం వచ్చిన రోగులతో మాట్లాడారు. అనంతరం ఆసుపత్రిలోని ల్యాబ్‌ను పరిశీలించారు.

క్లుప్తంగా

అక్రమ నిర్మాణాల సీజ్‌



కుంట్లూర్‌లో నిర్మిస్తున్న ఇళ్లను సీజ్‌ చేస్తున్న మున్సిపల్‌ అధికారులు

అబ్దుల్లాపూర్‌మెట్‌: కోర్టు ఉత్తర్వులను ధిక్కరించి నిర్మించిన అక్రమ కట్టడాలను పెద్దఅంబర్‌పేట మున్సిపల్‌ అధికారులు సీజ్‌ చేశారు. కుంట్లూర్‌ పరిధిలోని సర్వేనంబర్‌ 143లోని స్థల వివాదం కోర్టు పరిధిలో ఉండగా, సదరు సర్వేనంబర్‌లో ఎలాంటి నిర్మాణాలను చేపట్టకూడదని ఆదేశాలున్నాయి. అయినా అవేమీ పట్టించుకోకుండా నిర్మించిన ఐదు ఇళ్లను బుధవారం కమిషనర్‌ రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్‌ సిబ్బంది సీజ్‌ చేసింది.

వేంకటేశ్వరుడి సేవలో సంగీత దర్శకుడు

షాద్‌నగర్‌: ఫరూఖ్‌నగర్‌లోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం ప్రముఖ సినీ సంగీత దర్శకుడు ఆర్‌పీ పట్నాయక్‌ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. హైదరాబాద్‌ నుంచి కర్నూల్‌ వెళ్తుండగా మార్గమధ్యలో ఫరూఖ్‌నగర్‌లోని పాత జాతీయ రహదారి పక్కన ఉన్న శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయాన్ని ఆర్‌పీ పట్నాయక్‌ దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ స్థల పురాణం గురించి మున్సిపల్‌ కోఆప్షన్‌ సభ్యుడు ఒగ్గు కిషోర్‌ సంగీత దర్శకుడి దంపతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సాయీశ్వర్‌రెడ్డి, భూపాల్‌, అర్చకులు శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.

మాస్టర్‌ప్లాన్‌ కోసం వివరాల సేకరణ

కడ్తాల్‌లో సమావేశమైన టౌన్‌ప్లానింగ్‌ అధికారులు



మాస్టర్‌ ప్లాన్‌ తయారీపై వివరాలు సేకరిస్తున్న డీటీసీపీ ఏడీ సత్యభామ

కడ్తాల్‌: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం టౌన్‌ ప్లానింగ్‌ ఏడీ సత్యభామ, టౌన్‌ప్లానింగ్‌ అధికారి సువర్ణ ఆధ్వర్యంలో కడ్తాల్‌ పూర్వపు రెవెన్యూ పంచాయతీలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కడ్తాల్‌ పూర్వపు రెవెన్యూ పరిధిలోని గ్రామ పంచాయతీలను కలిపి మండల కేంద్రాన్ని అభివృద్ధి చేయడానికి ఇండికేటివ్‌ ల్యాండ్‌ యూస్‌ ప్లాన్‌(ఐఎల్‌యూపీ) ముసాయిదా తయారీపై సమీక్షించారు. పూర్వపు రెవెన్యూ పంచాయతీ పరిధిని అన్ని విధాలుగా అభివృద్ధి పరచాలనే లక్ష్యంతో, మాస్టర్‌ ప్లాన్‌లో మార్పులు, చేర్పులపై వారు చర్చించారు. పూర్వపు రెవెన్యూ పరిధిలో చెరువులు, కుంటలు, రహదారులు, ప్రభుత్వ భూములకు సంబంధించి వాటి సమగ్ర సమచారాన్ని సేకరించడం కోసం ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, జాతీయ రహదారిపై ఇరువైపులా చేపడుతున్న ఇళ్ల నిర్మాణాలు, రహదారులతో పాటు, ట్రాఫిక్‌కు అనుగుణంగా నివాస, వాణిజ్య, ఇండస్ట్రీయల్‌ తదితర వాటిని ప్రజల ఉపయోగార్థం మాస్టర్‌ ప్లాన్‌ ద్వారా అందుబాటులో ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్‌గౌడ్‌, టౌన్‌ ప్లానింగ్‌ అధికారులు ఉన్నారు.

కాగ్నా ప్రకోపం.. రైతుకు శాపం



కాగ్నా ఉపనది వరదనీటికి దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న ఏఈఓలు

ఆరుగాలం శ్రమిస్తున్న రైతన్నకు వరుణుడి రూపంలో శరాఘాతం ఎదురైంది. దుక్కులు దున్ని విత్తనాలు వేసుకున్న సమయంలో భారీ వర్షాలు తీరని నష్టాన్ని మిగిలించాయి. చేసిన కష్టం మొత్తం నీటి పాలు కావడంతో కర్షకులు తీవ్ర విషాదంలో మునిగిపోయాయి.

- ఉపనది వరద ఉధృతికి కొట్టుకుపోయిన పంటలు
- లబోదిబోమంటున్న అన్నదాతలు

ధారూరు: భారీ వర్షాలకు కాగ్నా ఉపనది ఉప్పొంగింది. మండల పరిధిలోని మైలారం వద్ద ఉధృతంగా ప్రవహించి పంట పొలాలను దెబ్బతీసి రైతుకు అపార నష్టాన్ని మిగిలించింది. నదికి ఇరువైపులా గురుదోట్ల, నాగారం క్లస్టర్ల ఏఈఓలు సంజూరాథోడ్‌, శిరీష బుధవారం దెబ్బతిన్న పంటలను పరిశీలించి రైతుల నుంచి వివరాలు సేకరించారు. మైలారం గ్రామ సమీపం నుంచి ప్రవహించే నదికి ఇరువైపులా పత్తి, వరి, కంది పంటలను సాగు చేశారు. నదికి సమీపంలో ఉన్న పంటలు పూర్తిగా కొట్టుకుపోయాయి. పొలాల మీదుగా వరదనీరు రావడంతో 30 ఎకరాల పత్తి, 10 ఎకరాల వరిని ముంచెత్తింది. కందిలో నీరు నిలిచిపోయి పంట కుళ్లిపోతుంది. విస్లావత్‌ రాజు, అంతారం గోపాల్‌, రవినాయక్‌ పత్తి పొలాలు పూర్తిగా వరదకు కొట్టుపోయాయని విలపించారు. మిగిలిన మొక్కలు నేలవాలాయని బాధిత రైతులు వాపోయారు. మరో 20 ఎకరాల పంట పాక్షికంగా దెబ్బతిందని తెలిపారు. వాటికి తగిన పరిహారం అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

మొత్తం కొట్టుకుపోయింది

మూడున్నర ఎకరాల్లో గత వారం వేరుశనగ విత్తనాలు వేశామని డీకే తండాకు చెందిన ప్రేమ్‌సింగ్‌, గేనిబాయి, రమేశ్‌ తెలిపారు. మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి వరదనీరు తమ పొలాల గుండా ప్రవహించడంతో వేసిన విత్తనాలు పూర్తిగా కొట్టుకపోయాయి. దీంతో పొలం మొత్తం మట్టి దిబ్బగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. దాదాపు రూ.75 వేల పెట్టుబడి నీటి పాలైందని గుండెలు బాదుకున్నారు. తమని ప్రభుత్వమే ఆదుకోవాలని వేడుకుంటున్నారు.





బస్సు ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

డొక్కు బస్సు.. గమ్యం తుస్సు!

కుల్కచర్ల: కాలం చెల్లిన ఆర్టీసీ బస్సులతో తీవ్ర అవస్థలు పడుతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం చౌడాపూర్‌ నుంచి పరిగి వెళ్లాల్సిన ఆర్టీసీ బస్సు అకస్మాత్తుగా ఆగిపోయింది. దీంతో గండిచెరువు ప్రాంతంలోనే బస్సును నిలిపివేసి ప్రయాణికులను ఇతర వాహనాల ద్వారా వెళ్లాల్సిందిగా సూచించారు. కాగా అక్కడకు చేరుకున్న సేవాలాల్‌ సేన పరిగి నియోజకవర్గ అధ్యక్షుడు భాస్కర్‌ విద్యార్థులతో మాట్లాడి సమస్య తెలుసుకున్నారు. అనంతరం బస్సు ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్నారులు పాఠశాలలకు వెళ్లేందుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సు ఆగిపోవడం ఇబ్బందికరమన్నారు. పరీక్షల సమయంలో ఆలస్యంగా వెళ్లాల్సి వస్తుందన్నారు. ఆర్టీసీ అధికారులు చొరవ తీసుకొని కండిషన్‌లో నూతన బస్సు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక సంఘ నాయకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

కుల్కచర్ల: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని సిడీపీఓ మెహరున్నిసా బేగం, కుల్కచర్ల కేజీబీవీ ప్రిన్సిపాల్‌ దేవి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కేజీబీవీ, అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంటుందన్నారు. ముఖ్యంగా బాలింతలు, గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడంతో ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత శుభ్రతను పాటిస్తూ శరీరానికి ఉపయోగకరమైన ఫలితాలు ఇచ్చే పౌష్టికాహారాన్ని తీసుకోవడం వల్ల ప్రసవ సమయంలో బాలింతలు, పుట్టినబిడ్డకు రోగనిరోధకశక్తి పెరిగి ఆరోగ్యకరంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు పద్మ, అనసూయ, లలిత తదితరులు పాల్గొన్నారు.



పోషకాహారంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

సందడిగా బతుకమ్మ సంబరాలు

కొడంగల్‌ రూరల్‌: మున్సిపల్‌ వైస్‌ చైర్‌ పర్సన్‌ ఉషారాణి తమ మిత్ర బృందంతో బుధవారం బతుకమ్మ సంబరాలు ముందస్తుగా నిర్వహించారు. రంగుల పువ్వులను సేకరించి బతుకమ్మలను పేర్చారు. ఇంటి ముంగిట బతుకమ్మ ఆట పాటలతో సందడి చేశారు. అనంతరం చెరువులో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.



బతుకమ్మ ఆడుతున్న మహిళలు



ఊరేగింపుగా వెళుతున్న అతివలు

హామీలన్నీ అమలు చేయాలి

సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య

కొడంగల్‌ రూరల్‌: రుణమాఫీ కాని రైతులకు తక్షణమే అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.వెంకటయ్య డిమాండ్‌ చేశారు. బుధవారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో సీపీఎం కొడంగల్‌ శాఖ ఆధ్వర్యంలో 3వ మహాసభలను నిర్వహించారు. సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్‌ సీతారాం ఏచూరికి సంతాపం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అధిక వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు పంట నష్ట పరిహారం అందించాలని, ఉపాధిహామీ పెండింగ్‌ బిల్లులు చెల్లించాలని, ఇంటి స్థలాలు, అర్హులైన వారికి డబుల్‌ బెడ్‌ రూమ్‌లను అందించాలని డిమాండ్‌ చేశారు. అనంతరం నాలుగు మండలాలకు సంబంధించి సీపీఎం మండల శాఖలకు కార్యదర్శులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దుద్యాల శాఖకు బుస్స చంద్రయ్య, కొడంగల్‌ శాఖ కార్యదర్శిగా మల్లప్ప, దౌల్తాబాద్‌ శాఖకు సత్యానందం, బొంరాస్‌పేట మండల కార్యదర్శిగా రాములులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మోహన్‌, సాయికుమార్‌, అశోక్‌, లక్ష్మణ్‌, అంజయ్య, సాయిదాస్‌, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకటయ్య

ఆర్టీసీ బస్సు ఢీకొని బల్దియా కార్మికురాలి మృతి

అబ్దుల్లాపూర్‌మెట్‌: ఆర్టీసీ బస్సు ఢీ కొట్టడంతో ఓ మహిళ మృతి చెందిన సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని గుంతపల్లి గ్రామానికి చెందిన బరిగెల రాములమ్మ(61) జీహెచ్‌ఎంసీలో పారిశుద్ధ్య కార్మికురాలిగా పనిచేస్తున్నారు. కాగా బుధవారం ఆమె విధులు ముగించుకొని గ్రామానికి వెళ్లేందుకు మధ్యాహ్నం 2గంటలకు అబ్దుల్లాపూర్‌మెట్‌ కూడలిలోని షాడో ఆస్పత్రి సమీపంలో ఉంది. అదే సమయంలో వచ్చిన హయత్‌నగర్‌ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు డ్రైవర్‌ నిర్లక్ష్యంగా నడిపి ఆమెను ఢీకొట్టాడు. ఈ ఘటనలో రాములమ్మ కాళ్లు పూర్తిగా విరిగిపోవడంతో పాటు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం ఎల్‌బీనగర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించగా.. అక్కడే చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో కార్మికుడి మృతి

నందిగామ: విద్యుదాఘాతానికి గురై ఓ కార్మికుడు మృతి చెందిన ఘటన మండల కేంద్రమైన నందిగామ శివారులో బుధవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. హైదరాబాద్‌ జగద్గిరిగుట్ట ప్రాంతానికి చెందిన అబ్దుల్‌(40) నందిగామ శివారులోని నూజీవీడు పారిశ్రామిక వాడ ఎదురుగా ఉన్న షెడ్డులో వెల్డింగ్‌ పనులు చేస్తున్నాడు. ఈ సమయంలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై అతడు కిందపడిపోయాడు. దీంతో తోటి కార్మికులు, నిర్వాహకులు క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఈ విషయమై ఇప్పటి వరకు తమకు ఫిర్యాదు అందలేదని ఇన్‌స్పెక్టర్‌ ప్రసాద్‌ తెలిపారు.

కొత్తూరులో కార్డన్‌ సెర్చ్‌

నందిగామ: కొత్తూరులో బుధవారం రాత్రి పోలీసులు కార్డన్‌ సెర్చ్‌ చేపట్టారు. శంషాబాద్‌ ఏసీపీ శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో పట్టణంలోని కిరాణాషాపులు, పాన్‌ షాపులు, దాబాలు, లాడ్జీలలో పెద్ద ఎత్తున తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కొన్ని షాపులలో నిషేధిత గుట్కా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం బెల్టు షాపులలో మద్యం విక్రయాలు కొనసాగిస్తున్నారని గుర్తించి వారిపైన కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ తనిఖీలలో ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు, నలుగురు ఎస్సైలు, 70 మంది సిబ్బంది పాల్గొన్నారు.

కల్తీ కలవరం



నిందితులతో పోలీసు అధికారులు



పట్టుబడిన కల్తీ అల్లం వెల్లుల్లి బాక్సులు

- 1,138 కిలోల అల్లం వెల్లుల్లి పట్టివేత
- టాస్క్‌ఫోర్స్‌ దాడుల్లో విస్తుగొలిపే విషయాలు

కుల్కచర్ల: కల్తీ కల్లోలం కలవరపెడుతోంది. కిరాణ దుకాణాల్లో లభించే వంటింటి సామగ్రి కల్తీమయం కావడంతో స్థానికులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. దాదాపు 1,138 కిలోల కల్తీ అల్లం వెల్లుల్లి పేస్టును పట్టుకున్నామని పోలీసులు తెలిపారు. టాస్క్‌ఫోర్స్‌ ఇన్‌స్పెక్టర్‌ అంజనేయులు, కుల్కచర్ల ఎస్‌ఐ అన్వేష్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ముందస్తు సమాచారం మేరకు ఈ నెల 23న స్థానిక పోలీసులతో కలిసి టాస్క్‌ఫోర్స్‌ అధికారులు మండలంలోని చౌడాపూర్‌లో శశిదర్‌ కిరాణ దుకాణ సముదాయంపై దాడి చేశారు. అక్కడ నకిలీ టీ పౌడర్‌, అల్లం వెల్లుల్లి పేస్టు లభ్యమైంది. దీనిపై ఆరా తీయగా ఆందోళనకర విషయాలు వెలుగులోకి వచ్చాయి. కీసరకు చెందిన దామోదర్‌రెడ్డి ముకుంద జింజర్‌, గార్లిక్‌ పేస్ట్‌ ఇండస్ట్రీస్‌ పేరిట కల్తీ అల్లం వెల్లుల్లి దందాకు తెరలేపాడు. కుళ్లిపోయిన అల్లం, సిట్రిక్‌ యాసిడ్‌, ఎసిటిక్‌ యాసిడ్‌, టేస్టింగ్‌ సాల్ట్‌ ఇతర భయంకర రసాయనాలను ఉపయోగించి వ్యాపారం నిర్వహిస్తున్నాడు. అక్కడి నుంచి మహబూబ్‌నగర్‌లోని బాలకృష్ణ, వెంకటేశ్వర్లు అనే డీలర్లకు సప్లై చేసి, అటు నుంచి గ్రామాల్లో ఉన్న కిరాణ షాపులకు విక్రయించేవారు. ఈ క్రమంలోనే చౌడాపూర్‌లో ఉన్న శశిదర్‌ షాపునకు కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్‌ వచ్చిందని విచారణలో తేలింది. ఈ వ్యవహారంలో కీసరలోని కల్తీ స్థావరంపై దాడి చేసి 200 కిలోల ఎల్లిపాయలు, 1,138 కిలోల కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నిందితులు శశిదర్‌, బాలకృష్ణ, వెంకటేశ్వర్లు, దామోదర్‌రెడ్డిలపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ అన్వేష్‌రెడ్డి బుధవారం తెలిపారు. కల్తీ ఆహార పదార్థాలు తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కేసును త్వరితగతిన విచారించి కల్తీ స్థావరాలను పట్టుకున్న టాస్క్‌ఫోర్స్‌, కుల్కచర్ల పోలీసులను ఎస్పీ నారాయణరెడ్డి, డీఎస్పీ కరుణసాగర్‌రెడ్డి అభినందించారు.

నైపుణ్యాభివృద్ధికే డ్యూటీ మీట్‌

అడిషనల్‌ ఎస్పీ రవీందర్‌రెడ్డి

అనంతగిరి: పోలీసుల పనితీరును మెరుగుపరిచేందుకు పోలీస్‌ డ్యూటీ మీట్‌లు ఎంతో దోహదపడుతాయని జిల్లా అడిషనల్‌ ఎస్పీ రవీందర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు బుధవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో పోలీసులకు డ్యూటీ మీట్‌ నిర్వహించారు. ఇందులో భాగంగా ముఖ్యంగా నేర పరిశోధన, నేర స్థల పరిశోధన, వీఐపీ మూమెంట్‌, డాగ్‌ స్క్వాడ్‌ పనితనం, ఫింగర్‌ ప్రింట్‌ పరిశోధన, బాంబు డిస్పోజల్‌ టీం విధులు, కంప్యూటర్‌పై నైపుణ్యం, అవాంఛనీయ సంఘటనలో వీడియోగ్రఫీ చేయు విధానం లాంటి అంశాలలో రాత పరీక్ష, మౌఖిక పరీక్షలు నిర్వహించారు. ఇందులో ఉత్తమ ప్రతిభ కనబర్చిన పోలీసు అధికారులు, సిబ్బందికి జోన్‌ స్థాయికి పంపించారు. అనంతరం ఏఎస్పీ మాట్లాడుతూ.. డ్యూటీ మీట్‌లు జిల్లా, జోనల్‌, రాష్ట్ర, జాతీయ స్థాయిలలో నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో డీసీఆర్‌బీ డీఎస్పీ జానయ్య, ఏఆర్‌ డీఎస్పీ వీరేష్‌, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్‌ ఆంజనేయులు, డాక్టర్‌ నిఖిల్‌, జిల్లాలోని సీఐలు, ఎస్‌ఐలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పోలీసులకు పరీక్షలు నిర్వహిస్తున్న అధికారులు

బస్సు నుంచి పడి మహిళ మృతి

ఆమనగల్లు: ప్రమాదవశాత్తు ఆర్టీసీ బస్సులో నుంచి పడి ఓ మహిళ మృతి చెందిన సంఘటన ఆమనగల్లు పట్టణ సమీపంలోని షాద్‌నగర్‌ రోడ్డులో బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. తలకొండపల్లి మండలం చుక్కాపూర్‌ గ్రామానికి చెందిన కడారి పెద్ద యాదమ్మ(55) పని నిమిత్తం ఆమనగల్లు పట్టణానికి వచ్చింది. తిరిగి సాయంత్రం చుక్కాపూర్‌ వెళ్లడానికి పట్టణంలోని బస్టాండ్‌లో ఆర్టీసీ బస్సు ఎక్కి కండక్టర్‌ సీటు పక్కన నిలబడింది. ఆమనగల్లు నుంచి షాద్‌నగర్‌ రోడ్డులో వెళుతున్న బస్సు గుంతలపై నుంచి వెళ్లడంతో ఆమె వద్ద ఉన్న సంచులో సామగ్రి పడటంతో వాటిని తీసుకుంటుంది. ఈ క్రమంలో మూలమలుపు వద్ద ఒక్కసారిగా మల్లడంతో బస్సులో నుంచి ఆమె కింద పడింది. తీవ్రగాయాల పాలైన యాదమ్మను వెంటనే చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో కల్వకుర్తి ప్రభుత్వాసుపత్రికి తరలించగా మార్గమధ్యలో మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. దీనిపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఆమనగల్లు ఎస్‌ఐ వెంకటేశ్‌ తెలిపారు.

వేతనం ఇవ్వడం లేదని మనస్తాపం

పురుగు మందు తాగి వీఓఏ ఆత్మహత్యాయత్నం

కొందుర్గు: తనకు వేతనం ఇవ్వలేదని ఓ వీఓఏ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించిన ఘటన జిల్లేడ్‌ చౌదరిగూడ మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జాగారం గ్రామానికి చెందిన స్వప్న రెండేళ్లుగా వీఓఏగా విధులు నిర్వర్తిస్తోంది. గతంలో ఇదే గ్రామానికి చెందిన రాజు అనే వ్యక్తి వీఓఏగా పనిచేశారు. అతను విధులకు హాజరు కాకపోవడంతో ఐకేపీ సిబ్బంది స్వప్నతో పని చేయించుకున్నారు. కానీ వీఓఏ బాధ్యతలు రాజు పేరునే ఉండటంతో ఆమెకు వేతనం ఇవ్వలేదు. ఈ విషయమై మంగళవారం ఏపీడీ సూర్యారావుకు వినతిపత్రం అందించగా.. పేరు మార్పిడి కానందున మీకు వేతనం ఇవ్వడం కుదరదని స్వప్నకు తెలియజేశారు. దీంతో మనస్తాపానికి గురైన ఆమె బుధవారం ఇంట్లో ఉన్న పురుగు మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను వెంటనే మహబూబ్‌నగర్‌లోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం స్వప్న ఆరోగ్యం నిలకడగా ఉందని తెలిపారు. ఇదిలా ఉండగా రాజు అనే వ్యక్తి ప్రస్తుతం బాకారం పంచాయతీ కారోబార్‌గా, ఉపాధి హామీ మేట్‌గా పనిచేస్తున్నాడని స్థానికులు తెలిపారు. ఒకే వ్యక్తికి మూడు రకాల బాధ్యతలు ఎలా అప్పగిస్తారని ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై ఉన్నతాధికారులు స్పందించి బాధితురాలు స్వప్నకు న్యాయం చేయాలని కోరారు.



మహబూబ్‌నగర్‌లో చికిత్సపొందుతున్న స్వప్న

ఆర్టీసీ డ్రైవర్‌పై చర్యలకు వినతి

ఇబ్రహీంపట్నం: దివ్యాంగుడిపై దురుసుగా ప్రవర్తించి, అవహేళన చేసిన ఇబ్రహీంపట్నం డిపో ఆర్టీసీ డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని వీహెచ్‌పీఎస్‌ రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య డిమాండ్‌ చేశారు. ఈ మేరకు బుధవారం డీఎం వెంకట నర్సప్పకు వినతిపత్రం అందించారు. అనంతరంజంగయ్య మాట్లాడుతూ.. ఐకేపీ ఏపీఎం రవీందర్‌ గత మంగళవారం సాయంత్రం ఐదున్నర గంటల ప్రాంతంలో ఇబ్రహీంపట్నం వెళ్లేందుకు చాదర్‌ఘాట్‌ వద్ద నిరీక్షిస్తున్నాడని తెలిపారు. ఈ సమయంలో ఎంజీబీఎస్‌ నుంచి ఇబ్రహీంపట్నంకు వెళ్తున్న (277) బస్సును రవీందర్‌ ఆపాదన్నారు. కానీ డ్రైవర్‌ బస్సును ఆపకుండా నెమ్మదిగా వెళ్లాడన్నారు. తంటాలు పడుతూ బస్‌ ఎక్కిన రవీందర్‌ను డ్రైవర్‌ అవహేళన చేస్తూ మాట్లాడాడని తెలిపారు. వైకల్యాన్ని ఎత్తి చూపుతూ అవమానపర్చిన డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. దివ్యాంగులకు కేటాయించిన సీట్లలో వారే కూర్చునే విధంగా సిబ్బందికి ఆదేశాలు ఇవ్వాలని డీఎంకు విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర నాయకులు చిట్టి రాజు, యాచారం జంగయ్యతో, మిద్దెల బాలరాజ్‌, గువ్వల యాదయ్య, ఆకుల సంజీవ, కందుకూరి నాగరాజు, ఎండీ సలీం, చెరుకూరి భానుప్రసాద్‌ ఉన్నారు.

ఫార్మాపై ప్రతిపక్షాల మౌనం

ప్రభుత్వం తీసుకొచ్చిన ఫార్మాసిటీకి వ్యతిరేకంగా భూ బాధితులు(రైతులు) చేపడుతున్న దీక్షకు ప్రతిపక్షాల నుంచి స్పందన కరువైంది. ఇటీవల బీజేపీ, బీఆర్‌ఎస్‌ నాయకులను కలిసి తమకు మద్దతు తెలపాలని కోరినా సమాధానం రావడం లేదని బాధితులు ఆరోపిస్తున్నారు. అయినా ఫార్మాకు వ్యతిరేకంగా తమ పోరు ఆగదని బాధిత రైతులు స్పష్టం చేస్తున్నారు.

- పక్షం రోజులైనా స్పందన లేదు
- రిలే నిరాహార దీక్షకు కరువైన బీజేపీ, బీఆర్‌ఎస్‌ మద్దతు



తమకు మద్దతు తెలపాలని ఎంపీ డీకే అరుణకు వినతిపత్రం అందిస్తున్న భూ బాధితులు (ఫైల్‌)

దుద్యాల్‌: పర్యావరణానికి విఘాతం కలిగించే ఫార్మా కంపెనీలు తమ ప్రాంతంలో ఏర్పాటు చేయొద్దంటూ భూ బాధితుల నిరాహార దీక్ష కొనసాగుతుంది. పక్షం రోజుల నుంచి దుద్యాల్‌ మండలం హకీంపేటలో రిలే నిరాహార దీక్షను బాధిత రైతులు చేస్తున్నారు. అయినా ప్రభుత్వం నుంచి స్పందన కరువైందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని రోజులుగా ఫార్మా కంపెనీకి వ్యతిరేకంగా మండలంలోని లగచెర్ల, హకీంపేట, పోలేపల్లి, పులిచెర్ల తండా, రోటిబండా తండాల గ్రామాల రైతులకు ప్రతిపక్షాల నుంచి సైతం ఆశించినస్థాయిలో మద్దతు కరువైంది. తమకు అండగా నిలవాలని ఇటీవల మహబూబ్‌నగర్‌ ఎంపీ డీకే అరుణను మండలానికి చెందిన బీజేపీ నాయకులతో బాధితులు కలిసి విన్నవించారు. అలాగే హకీంపేటలో ఫార్మాకు వ్యతిరేకంగా చేపడుతున్న ధర్నాకు మద్దతుగా కొడంగల్‌కు రావాలని బీఆర్‌ఎస్‌ నాయకులు, భూ బాధితులు కేటీఆర్‌ను కలిసి వినతిపత్రం అందించినా ఫలితం శూన్యమని ఆవేదన వెలిబుచ్చారు. అటు ప్రభుత్వం, ఇటు ప్రతిపక్షాలు స్పందించకపోవడం దిగ్భ్రాంతిని కలిగిస్తోందని బాధితులు వాపోతున్నారు.

పోరాటం ఆపేదే లేదు

ఐదు గ్రామాలకు చెందిన ఫార్మా భూ బాధితులు కొంత కాలంగా ధర్నాలు, ఆందోళనలు, రిలే దీక్షలు చేస్తున్నారు. ప్రభుత్వం ఫార్మా కంపెనీకి వ్యతిరేకంగా చేపట్టిన పోరు ఆపేది లేదని తేల్చి చెబుతున్నారు. ఫార్మా కంపెనీ ఏర్పాటు కోసం బలవంతంగా భూములు లాక్కుంటే మాత్రం ప్రాణాలకు తెగించి పోరాడుతామని రైతులు హెచ్చరిస్తున్నారు.



కొనసాగుతున్న రిలే నిరాహార దీక్ష